క్లుప్తంగా

తాగునీటి సరఫరాకు రేపు అంతరాయం

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ రైవాడ మంచినీటి సరఫరా పథకం ద్వారా నరవ నుంచి టీఎస్సార్‌కు వచ్చే పైప్‌లైన్ ఆర్ అండ్ బీ కార్యాలయం ఎదురుగా లీక్ కావడంతో తాగునీటి సరఫరాకు శుక్రవారం అంతరాయం కలుగుతుందని జీవీఎంసీ మంచినీటి సరఫరా విభాగం కార్యనిర్వాహక ఇంజినీరు మురళీకృష్ణ బుధవారం తెలిపారు. జోన్ - 3, 5, 8 పరిధిలో ఆ రోజు ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్టు చెప్పారు.

- జోన్ - 3 పరిధిలో డాక్టర్స్ కాలనీ, ఎంఎంటీసీ కాలనీ, ఏపీఎస్ఈబీ కాలనీ, అంబేడ్కర్ నగర్, పీ అండ్ టీ కాలనీ, గాంధీనగర్ ఏరియా, రామకృష్ణానగర్, శంకరమఠం మెయిన్ రోడ్డు, చాకలిపేట, లలితానగర్, చైతన్యనగర్, నక్కవానిపాలెం, క్రాంతినగర్, ఎన్‌హెచ్ - 16 రోడ్డు, కెప్టెన్ లైన్ ఏరియా, ఇందిరాగాంధీ బొమ్మ లైన్, 80 ఫీట్‌రోడ్డు తదితర ప్రాంతాలు.
- జోన్ - 5 పరిధిలో లక్ష్మీనారాయణపురం - 1, 2, లెపర్సీకాలనీ, కస్తూరినగర్ -1, శాంతినగర్ - 1, 2, సంజీవయ్య కాలనీ, కప్పరాడ, తిక్కవానిపాలెం, జైప్రకాష్‌నగర్, మహాత్మా గాంధీనగర్, ఇందిరానగర్ 2 నుంచి 5, బాపూజీనగర్, పెద్దకొత్తూరు, అరుంధతినగర్, రాంజీ ఎస్టేట్, మాధవధార, మాధవధార ఉడా లేఅవుట్, మద్రిపాలెం, మద్రిపాలెం ఉడా లేఅవుట్, ఎన్‌జీజీవోస్ కాలనీ, కంచరపాలెం, కరాసా, గ్రీన్‌గార్డెన్స్, శివనగర్, జ్యోతినగర్, పార్వతినగర్, శాంతినగర్, తుమ్మడిపాలెం, హూస్సేన్‌నగర్, ఆర్పీ పేటకు నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు.

15 నుంచి కేరళ ఆయుర్వేద శిబిరం

దాబాగార్డెన్స్ : ఆయుర్వేద రంగంలో నిష్ణాతులైన డాక్టర్ ఉన్నికృష్ణన్ నాయర్ ఐదు రోజులపాటు విశాఖలో అందుబాటులో ఉంటారని వైద్యరాజ్ ఔషధాలయ మేనేజర్ దినూప్ తెలిపారు. జీవీఎంసీ కార్యాలయం ఎదురుగా గల ఔషధాలయంలో బుధవారం శిబిరం వివరాలు వెల్లడించారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో మురళీనగర్, శ్రీదేవి పార్క్ వద్ద గల ఔషధాలయంలోనూ, 18, 19న జీవీఎంసీ ఎదురుగా గల రామ్‌నగర్‌లో గల వైద్యరాజ్ ఔషధాలయంలో అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఆయిర్వేద పంచకర్మ విధానం ద్వారా దీర్ఘకాల రోగాలకు చికిత్స అందజేయనున్నట్టు దినూప్ తెలిపారు. హైపర్ టెన్షన్ (ఆందోళన), ఆర్థరైటీస్ (కీళ్ల వ్యాధులు), పక్షవాతం, నడుము నొప్పి, స్పాండిలైటిస్, మానసిక ఒత్తిడి, నిద్రలేమి, రుమాటిజం వంటి సమస్యలతో బాధపడే వారికి ప్రత్యేక చికిత్స అందజేయనున్నారని చెప్పారు. అవసరమైన వారు 80080 00670, 90305 68264లో సంప్రదించాలని సూచించారు.

భారీ అన్నసమారాధన



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

సీతమ్మధార : జీవీఎంసీ 24వ వార్డులోని శ్రీఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం ఉదయం నుంచి ఆలయంలో అర్చకులు రామారావు శర్మ, మహేష్ ఆధ్వర్యంలో విశేష పూజలు చేశారు. పంచామృతం, పలు రకాల పళ్ల రసాలతో అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో అన్నసమారాధన ఏర్పాటు చేశారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి బండారు ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. రాజు, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

పట్టా హక్కు కల్పించాలి

సీతమ్మధార : తమ నివాసాలను క్రమబద్ధీకరించి పట్టా హక్కు కల్పించాలని జీవీఎంసీ 51వ వార్డులోని ఏకలవ్య కాలనీ గ్రామాభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు, కాలనీ వాసులు ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజును కోరారు. ఈ మేరకు బుధవారం బాలయ్యశాస్త్రి లే అవుట్‌లోని కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతిపత్రం అందించారు. 2019 వరకు ఉన్న నివాసాలు క్రమబద్ధీకరిస్తామని ప్రభుత్వం ప్రకటించిందని గుర్తు చేశారు. కాలనీని అనుకుని ఉన్న గెడ్డకు రక్షణ గోడ లేక పలువురు గాయపడ్డారని, గతంలో కొందరు చనిపోయారని... ఇప్పటికైనా రక్షణ గోడ నిర్మించాలని కోరారు. కాలనీలో సామాజిక భవనం నిర్మించాలని కోరారు.

ఎన్నికల ప్రచార కార్యాలయం ప్రారంభం

మురళీనగర్ : ఉత్తరాంధ్ర ఎమ్మెల్సీ అభ్యర్థిగా అత్యధిక ఉపాధ్యాయ సంఘాలు మద్దతు పలుకుతున్న పి.రఘువర్మను గెలిపిద్దామని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ (257) రాష్ట్ర పూర్వ కార్యదర్శి బి.వెంకటపతిరాజు పిలుపునిచ్చారు. మురళీనగర్‌లో రఘువర్మ ఎన్నికల ప్రచార కార్యాలయాన్ని బుధవారం సాయంత్రం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కొటాన శ్రీను, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సీహెచ్ కరుణాకర్, టి.రామకృష్ణారావు, కార్యదర్శి ఎస్.పెద్దినాయుడు, గౌరవాధ్యక్షుడు ఆర్.శ్రీనివాసరావు, శ్యామ్‌కుమార్, ఆనందపురం మండల ప్రధాన కార్యదర్శి రమేష్, రాష్ట్ర భాషోపాధ్యాయ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.ఉమాపతి, సన్యాసిరావు, ఎర్రునాయుడు, నరేష్, రమణ, రాజబాబు, ముత్యాలనాయుడు, ఏపీటీఎఫ్ కార్యకర్తలు పాల్గొన్నారు.

నో షెల్టర్



ఐటీఐ కూడలి బస్టాప్‌లో ఇలా...



తాటిచెట్లపాలెం వెళ్లే రహదారిలో బస్ కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు



కప్పరాడ బస్టాప్ వద్ద ఎండలో ప్రయాణికుల అవస్థలు



ఊర్వశి కూడలి నుంచి ఐటీఐ కూడలికి వెళ్లే బస్టాప్ ఇలా...

నిలువ నీడలేక ప్రయాణికుల అవస్థలు

జాతీయ రహదారి కూడళ్లలో మహిళలు, వృద్ధులకు ఇక్కట్లు

ఎండా, వానల్లోనే బస్సుల కోసం నిరీక్షణ

కంచరపాలెం : స్థానిక కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్ జాతీయ రహదారి ప్రధాన కూడళ్లలో బస్ షెల్టర్లు లేక ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. వేలాది మంది ఎండకు ఎండి, వానకు తడిచి, చలికి వణుకుతూ బస్సుల కోసం నిరీక్షిస్తున్నారు. షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు పలుమార్లు అధికారుల ముందు మొరపెట్టుకున్నా ఫలితం లేకపోయింది. కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్ పరిధిలోని కొండవాలు ప్రాంతాల నుంచి రోజూ విద్యార్థులు, ఉద్యోగులు, కూలీలు వేల సంఖ్యలో ఆర్టీసీ బస్సుల ద్వారా పలు ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తుంటారు. వీరు బస్సుల కోసం ఎం డ, వానలో నిరీక్షించాల్సి వస్తోంది. కొన్ని ప్రాంతాల్లో జాతీయ రహదారి సర్వీసు రోడ్డు నెట్ వేలో బస్టాప్‌లు శిథిలావస్థలో ఉంటే ప్రధాన రహదారిలో బస్సులు ఆపుతుండడంతో వాటి కోసం పరుగెత్తాల్సిన పరిస్థితి కనిపిస్తోంది. షెల్టర్లు లేకపోవడంతో వర్షాలు కురిసేటప్పుడు ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. జాతీయ రహదారి ఫుట్‌పాత్‌లపై స్వచ్ఛంద సంస్థలు నిర్మించిన సిమెంట్ బల్లలే ప్రయాణికులు సేద తీరేందుకు ఉపయోగపడుతున్నాయి ఊర్వశి కూడలిలో ఐటీఐ, పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు ట్రాఫిక్ సిగ్నల్స్ వద్దే బస్సుల కోసం పడిగాపులు కాస్తున్నారు. కంచరపాలెం, కప్పరాడ, తాటిచెట్లపాలెం కూడలి రహదారిలోనూ బస్ షెల్టర్లు లేకపోవడంతో ఇదే పరిస్థితి కనిపిస్తోంది.

బస్సు షెల్టర్ జాడే లేదు

జాతీయ రహదారిలో బస్ షెల్టర్లు లేకపోవడంతో ఎండా, వానల్లో బస్సుల కోసం గంటల సమయం వేచి ఉండాల్సి వస్తోంది. వృద్ధులు, దివ్యాంగుల పరిస్థితి మరీ దారుణంగా ఉంటోంది. బస్ షెల్టర్ల నిర్మాణం విషయాన్ని ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకెళ్లాం. అయినప్పటికీ ఎవరూ స్పందించడం లేదు. నగరంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నిర్మించిన 'బస్ బే'లు సుందరంగా ఉన్నాయి. మా ప్రాంతంలో మాత్రం బస్ షెల్టర్ల జాడే కనిపించడం లేదు.

- ఎస్.ఉషారాణి, ఊర్వశి కూడలి

అధికారులు స్పందించాలి

బస్ షెల్టర్లు లేక, నిలువ నీడ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. జాతీయ రహదారిలో బస్ షెల్టర్ల నిర్మాణంపై కూటమి ప్రభుత్వం కనీసం స్పందించకపోవడంతో ప్రయాణికులు ఎండా, వానల్లో పడిగాపులు కాస్తున్నారు. గత ప్రభుత్వం చేసిన అభివృద్ధి నేడు కనిపించకపోవడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి బస్ బే నిర్మాణాలు చేపట్టాలి.

- ఎస్.నాగేంద్రరావు, కంచరపాలెం

గత ప్రభుత్వంలో సుందరంగా షెల్టర్లు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి హయాంలో నగరంలోని బస్ షెల్టర్లను 'బస్ బే' పేరిట మొదటి విడతలో కోట్ల రూపాయిలు ఖర్చు చేసి అతి సుందరంగా, ప్రయాణికులకు సౌకర్యవంతంగా నిర్మించారు. నగరంతోపాటు జాతీయ రహదారిలో మద్దిలపాలెం, సీతమ్మధార, సీతంపేట, అక్కయ్యపాలెం, కైలాసపురం వరకు వైఎస్సార్‌సీపీ సంక్షేమ పథకాలు నవరత్నాలను చూపే లోగోలతో 'బస్ - బే'లు నిర్మించి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. రెండో విడతలో తాటిచెట్లపాలెం నుంచి కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ జంక్షన్, బిర్లా జంక్షన్, ఆర్ అండ్ బీ కూడలి జాతీయ రహదారిలో బస్ బేలు నిర్మించే ప్రతిపాదన ఉన్నప్పటికీ సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలు కావడంతో పనులు నిలిచిపోయాయి. కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసి 9 నెలలు గడుస్తున్నా నేటికీ 'బస్ బే' ల నిర్మాణం విషయాన్ని పట్టించుకునే వారే కనిపించడం లేదు. విషయాన్ని స్థానిక ప్రజాప్రతినిధుల దృష్టికి పలువురు తీసుకెళ్లినప్పటికీ ఎవరూ కనీసం స్పందించడం లేదు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి వచ్చే ఎండకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఈ మూడు ప్రధాన ప్రాంతాల్లో బస్ షెల్టర్లు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా తాటిచెట్లపాలెం, కంచరపాలెం, ఊర్వశి కూడలి, ఐటీఐ కూడలి, బిర్లా జంక్షన్, పంబాబ్ హోటల్ జంక్షన్, ఆర్ అండ్ బీ కూడలిలో అత్యవసరంగా 'బస్ బే'లు నిర్మించాలని పలువురు కోరుతున్నారు. ఈ ప్రాంతాల్లో రోడ్లకు ఇరువైపులా ప్రయాణికులు రాకపోకలు సాగించే మార్గాల్లో షెల్టర్ ఏర్పాటు చేయాలని వేడుకుంటున్నారు.



నగరంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నిర్మించిన 'బస్ బే'

ఉద్యోగార్థులకు ఇంటర్వ్యూ స్కిల్స్‌పై శిక్షణ



శిక్షణ ఇస్తున్న ట్రైనర్ నఫీసా బరోడావాలా

సీతంపేట : పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు ఇంటర్వ్యూలో విజయం సాధించేందుకు అవసరమైన స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌ను స్థానిక విశాఖ పౌరగ్రంథాలయంలో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం సాయంత్రం ఇంటరాక్టివ్ సెషన్ నిర్వహించారు. ఈ రంగంలో 22 సంవత్సరాల అనుభవం ఉన్న నఫీసా బరోడావాలా విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శిక్షణలో పాల్గొనే యువత జస్ట్ ఏ మినిట్ సెషన్ ద్వారా తమ ఆలోచనా సామర్థ్యాలను పదును పెట్టుకుంటారని తెలిపారు. మాక్ ఇంటర్వ్యూ డ్రిల్ ద్వారా అనుభవాన్ని పొందుతారన్నారు. గ్రంథాలయ సొసైటీ కార్యదర్శి డి.ఎస్.వర్మ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో టీమ్‌వర్క్, ఆత్మవిశ్వాసం, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు, సానుకూల దృక్పథం పెంపొందుతాయని తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న స్కిల్స్ ప్రాక్టీస్ చేయడం ద్వారా తొలి ప్రయత్నంలోనే ఇంటర్వ్యూలో విజయం సాధిస్తారని తెలిపారు.

కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఉపాధ్యక్షుడిగా విశ్వనాథం



నియామకపత్రం అందుకుంటున్న విశ్వనాథం

సీతంపేట : ది నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ ఆంధ్రప్రదేశ్ వైస్ చైర్మన్‌గా విశ్వనాథం యాదవ్ నియమితులయ్యారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో కమిషన్ చైర్మన్ సాయిరమేష్, అడిషనల్ ఎస్పీ త్రినాథ్ చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. అలాగే ఆదినారాయణ రాజు ఈసీ మెంబర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా విశ్వనాథం మాట్లాడుతూ వినియోగదారుల హక్కులపై అవగాహన లేక చాలా మంది దోపిడీకి గురవుతున్నారని, ప్రజల్లో అవగాహన కల్పించి చైతన్యం తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనపై నమ్మకంతో కీలక పదవి ఇచ్చిన చైర్మన్ సాయి రమేష్‌కు, సౌత్ ఇండియా చైర్మన్ దాడి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నేషనల్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రాజు, నేషనల్ డైరెక్టర్ దిలీప్ రాజ్, సౌత్ ఇండియా జాయింట్ సెక్రటరి సన్యాసిరావు, డివిజన్ చైర్మన్ షరీఫ్, కమిషన్ సభ్యులు పాల్గొన్నారు.

నాలుగో పట్టణ పీఎస్ ఇన్‌చార్జి సీఐగా దాలిబాబు

సాక్షి ఎఫెక్ట్..

సీతమ్మధార : నగర పోలీస్ కమిషనర్ ఆదేశాలతో నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్‌చార్జి సీఐగా సీసీఎస్ - 1 సీఐ దాలిబాబు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఇక్కడ సీఐగా పనిచేస్తున్న సత్యనారాయణ అనారోగ్య కారణంతో రెండు వారాలు సెలవులో వెళ్లారు. దీంతో స్టేషన్‌లో పోలీసులపై కేసుల ఒత్తిడి పెరిగింది. దీనిపై 'పోలీసులపై కేసుల ఒత్తిడి' శీర్షికతో సాక్షిలో బుధవారం ప్రచురించిన కథనానికి నగర కమిషనర్ స్పందించారు. దాలిబాబును ఇన్‌చార్జి సీఐగా నియమించారు.



సీఐ దాలిబాబు

ఘనంగా సంపత్ వినాయక ఆలయ వార్షికోత్సవం



జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌ను సత్కరిస్తున్న కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు



ప్రత్యేక అలంకరణలో ఉత్సవ వినాయకుడు

కంచరపాలెం : జీవీఎంసీ 47వ వార్డు కంచరపాలెం పరిధి తిక్కవానిపాలెం కాలనీలో వెలసిన సంపత్ వినాయక పార్వతి విశ్వేశ్వర ఆలయ 25వ వార్షికోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ పాల్గొని వినాయకునికి ప్రత్యేక పూజలు చేశారు. పార్టీలకు అతీతంగా అన్ని పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు వినాయకుడిని దర్శించుకున్నారు. పార్వతి పరమేశ్వరుల కల్యాణ మహోత్సవం, రుద్రహోమం, పూర్ణాహుతి, పూజ వైభవంగా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్‌ను తిక్కవానిపాలెం కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు గనకళ్ల శంకర్, సభ్యులు, గ్రామ పెద్దలు సత్కరించారు. తర్వాత అలయ ఆవరణలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. వానపల్లి అప్పన్న, కోలా చంటి, గరికీన పరుశయ, సూరాడ కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బౌద్ధాలయంలో మాఘ పౌర్ణమి పూజలు

కంచరపాలెం: స్థానిక కంచరపాలెం ఆశోక్‌నగర్‌లో ఆంధ్ర బౌద్ధ కేంద్ర సమాజం ప్రధాన కార్యదర్శి కె.రాజుగణేష్ ఆధ్వర్యంలో మాఘ శుద్ధ పౌర్ణమిని పురస్కరించుకుని బుద్ధునికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ప్రముఖ బౌద్ధ ఉపాసకులు కడలి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నాది అనేది అశాంతి, నాది కాదనేది శాంతి అని ఉపదేశించారు. సమాజంలో బుద్ధునికి గౌరవమైన స్థానం ఉందన్నారు. అనంతరం వృద్ధులు, మహిళలకు చీరలు, ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమాజం కార్యదర్శి రాజుగణేష్, ఈ.రాజు, భీమరావు, రాజారావు, ఒ.తాతారావు, లక్ష్మి, అరుణ్, తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న నిర్వాహకులు

మహిళలకు కుట్టుమిషన్ల పంపిణీ

తాటిచెట్లపాలెం : కైలాసపురం రోడ్‌లో గల గ్రేస్ బాప్టిస్ట్ టెంపుల్‌లో బుధవారం మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేశారు. చర్చి వ్యవస్థాపక అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ గరికిముక్కుల జోసఫ్ రాబర్ట్ జయంతి సందర్భంగా పాస్టర్ గరికిముక్కుల పాల్ విక్టర్ కుట్టుమిషన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రేస్ బాప్టిస్ట్ చర్చ్ తరపున ఆర్థికంగా వెనుకబడిన ఒంటరి మహిళలకు, వితంతు మహిళలకు చేయూత ఇచ్చేందుకు కుట్టు శిక్షణ కేంద్రాన్ని సెప్టెంబర్‌లో ప్రారంభించామని తెలిపారు. కార్యక్రమంలో ఆల్‌ఫ్రెడ్ మహంతి, పాస్టర్లు జి.కెవిన్ పీటర్, వై.జార్జిబాబు, వై.బాలరాజ్, ఎం.సుధాకర్ పాల్, బి.సాల్మన్‌రాజు, ప్రేమ్ తరంగా, తదితరులు పాల్గొన్నారు.



కుట్టుమిషన్లు అందుకున్న మహిళలతో పాల్ విక్టర్

వైభవునికి పంచామృతాభిషేకం

మురళీనగర్ : కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలో వెలసిన వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా బుధవారం వైభవుడికి పంచామృతాభిషేకం నిర్వహించారు. ఉదయం 6.30 గంటలకు ఆర్జిత సేవలో పాల్గొనే దాతలు, భక్తులు మేళ తాళాలు, మంగళ ధ్వని, వేద మంత్రోచ్ఛరణ మధ్య ఆలయం చుట్టూ అభిషేక ప్రదక్షిణ చేశారు. అనంతరం శ్రీవారికి పాలు, పెరుగు, తేనె, నెయ్యి, పంచదార, ఫలరసాలు, పసుపు, కుంకుమ, చందనం తదితర సుగంధ ద్రవ్యాలతో వైభవుడికి అభిషేకం చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

అభాగ్యులకు సేవతోనే సంతృప్తి



ఆశ్రమంలో ఆహార పొట్లాలు అందజేస్తున్న కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం : జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం మెయిన్ రోడ్డులో వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు కోడిగుడ్ల శ్రీధర్ ఆధ్వర్యంలో జైకుతైల్ మినిస్ట్రీస్ అండ్ వెల్ఫేర్ సొసైటీలో బుధవారం పలు సేవా కార్యక్రమాలను కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ ప్రారంభించారు. అనాథలు, దివ్యాంగులు, వృద్ధులకు చీరలు, దుప్పట్లు, ఆహార ప్యాకెట్లు అందించారు. ఆశ్రమానికి అవసరమైన నిత్యావసర సరకులు, ఫ్యాన్లు శ్రీధర్ అందజేశారు. అనంతరం వైఎస్సార్‌సీపీ వార్డు కార్యాలయంలో క్లస్టర్ ఇన్‌చార్జి కోడిగుడ్ల శ్రీధర్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. పేదలకు సేవ చేయడంతోనే ఆత్మ సంతృప్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో వేళంగి జీరావు, సుధాకర్, భవాని, అన్నపూర్ణ, ఎల్.కుమార్, పాత్రపిల్లి సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

రిజర్వు నిధులతో అభివృద్ధి చేయాలి

తాటిచెట్లపాలెం : పోర్టు హాస్పిటల్ టెండరు పేరుతో ఎవరొచ్చినా అడ్డుకోవాలని సీఐటీయూ గౌరవ అధ్యక్షుడు వీఎస్ పద్మనాభరాజు పిలుపునిచ్చారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 135వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోర్టు హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందన్నారు. సుమారు 40 వేల మంది ఉద్యోగుల కుటుంబాలు ఈ ఆస్పత్రి నుంచి వైద్య సేవలు పొందుతున్నాయని... అటువంటి ఆస్పత్రిని ప్రైవేటు వారి చేతిలో పెట్టడం సరికాదన్నారు. పోర్టు వద్ద ఉన్న రిజర్వు నిధులతో అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు కె.సత్యనారాయణ, జె.సత్యనారాయణ, సీహెచ్ త్రినాథరావు, గణేష్, ఈశ్వర్రావు పాల్గొన్నారు.

జల'ధార'కు భారీగా భక్తులు

మద్రిపాలెం : మాఘపౌర్ణమి పర్వదినం సందర్భంగా జీవీఎంసీ 51వ వార్డు మాధవస్వామి ఆలయంలో ఉన్న జల'ధార'కు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. బుధవారం వేకువజాము నుంచి వేల సంఖ్యలో భక్తులు అక్కడకు చేరుకుని పవిత్ర స్నానమాచరించారు. అనంతరం అక్కడ కొలువై ఉన్న శ్రీలీలా మాధవుని దర్శించుకున్నారు. మాఘ పౌర్ణమి నాడు నదీస్నానం, సముద్ర స్నానం చేయడం ద్వారా పాపాలు హరించి పుణ్యం లభిస్తుందని భక్తుల నమ్మకం. మాధవధార ప్రాంతవాసులే కాకుండా, చుట్టపక్కల ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి స్నానాలు ఆచరించారు. అక్కడకు వచ్చిన భక్తులకు ఇబ్బందులు కలగకుండా దేవదాయ శాఖ సిబ్బంది ఏర్పాట్లు చేశారు. పోలీసులు బందోబస్తు నిర్వహించారు.



స్నానమాచరించేందుకు క్యూలో ఉన్న భక్తులు

ఎరుకుమాంబకు వైభవంగా జలాభిషేకం

సీతమ్మధార : దొండపర్తిలో వెలసిన శ్రీఎరుకుమాంబ అమ్మవారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం అర్చకుడు శ్రీనివాస్ ముందుగా గణపతి పూజ చేశారు. అనంతరం అమ్మవారికి మాఘ పౌర్ణమి సందర్భంగా మహా కుంభమేళా ప్రయాగరాజ నుంచి తీసుకొచ్చిన గంగా యమునా సరస్వతి నదుల పవిత్ర జలాలతో భక్తుల స్వహస్తాలతో అభిషేకం జరిపారు. భక్తుల గోత్రనామాలతో విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారికి నూతన చీరతో పలు రకాలు పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. శ్రీఎరుకుమాంబ అమ్మవారు దేవతామూర్తిగా (పార్వతీదేవి) ఈ ప్రాంతంలో అవతరించారని నమ్మే భక్తులు ప్రతీ బుధవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు... మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పసుపు నీళ్లతో అభిషేకం చేయడం ఆచారంగా వస్తున్నట్లు అర్చకులు తెలిపారు. అనంతరం భక్తులకు ప్రసాదం అందించారు. కార్యక్రమంలో సిబ్బంది సత్యనారాయణరాజు పాల్గొన్నారు.



జలాభిషేకం కోసం నీరు తీసుకొస్తున్న భక్తులు

చివరి ఇంక్రిమెంట్‌కు ఆమోదం

తాటిచెట్లపాలెం: రైల్వేలో పనిచేసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులకు చివరి ఇంక్రిమెంట్‌ను రైల్వే బోర్డు మంజూరు చేసిందని, ఇది కార్మికులకు ఎంతో ఉపయోగమని సౌత్ కోస్ట్ రైల్వే ఓబీసీ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ పెదిరెడ్ల రాజశేఖర్ తెలిపారు. గతంలో రైల్వేలో పూర్తికాలం సర్వీసు చేసి పదవీ విరమణ పొందిన వారికి చివరి ఇంక్రిమెంట్ ఉండేది కాదని, దీనివల్ల ఎన్నో ప్రయోజనాలను కోల్పోయేవారన్నారు. ఇందుకోసం దేశవ్యాప్తంగా అన్ని జోన్లలో పోరాటాలు, కోర్టు కేసుల ద్వారా పోరాడడంతో ఎట్టకేలకు రైల్వే బోర్డు అంగీకరించిందని తెలిపారు. 2023, 1 మే నుంచి పదవీ విరమణ పొందిన వారందరికీ వర్తిస్తుందని ఆయన తెలిపారు. లక్షలాది మంది ఉద్యోగులు లబ్ధి పొందుతారని పేర్కొన్నారు.



పెదిరెడ్ల రాజశేఖర్

వైభవోపేతంగా శ్రీలలితాదేవి నగరోత్సవం

సీతంపేట : శ్రీలలితాపీఠం వార్షికోత్సవాల ముగింపు, మాఘ పౌర్ణమి సందర్భంగా శ్రీలలితాదేవిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై బుధవారం సాయంత్రం ఊరేగించారు. మేళతాళాలు, కోలాటం, తప్పెటగుళ్లు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ నగర వీధుల్లో ఊరేగింపు కనుల పండువగా సాగింది. అక్కయ్యపాలెం శ్రీలలితాపీఠం వద్ద ప్రారంభమైన నగరోత్సవం శంకరమఠం రోడ్, డైమండ్ పార్క్, దొండపర్తి కూడలి, అక్కయ్యపాలెం మెయిన్ రోడ్ మీదుగా తిరిగి పీఠానికి చేరుకుంది. అమ్మవారి పల్లకీ మోయడానికి భక్తులు పోటీపడ్డారు. పీఠం ఉత్తరాధికారి దత్తేశ్వరానంద భారతీ స్వామి టాపులేని కారులో ఊరేగింపులో పాల్గొన్నారు. ముందుగా ఉదయం పీఠంలో లలితాదీక్ష చేపట్టిన భక్తులు దీక్ష విరమించారు. కుర్తాళం పురోహితులు మాచవోలు రమేష్‌శర్మ, లలితాపీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్, ఉత్సవ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



శ్రీలలితాదేవి పల్లకీ ఊరేగింపులో భక్తులు